www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY



తెలంగాణ దిక్సూచి

ఆదివారం | 02 | ఆగస్టు | 2026 | పేజీలు: 08

# ఆరోగ్యవంతమైన జీవితానికి తొలి పునాది

## జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా




**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు-2026 సందర్భంగా ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమాల్లో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నవజాత శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలే సంపూర్ణ పోషకాహారమని అన్నారు. శిశువు జన్మించిన తొలి గంటలోనే తల్లిపాలను ప్రారంభించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెంపొందడంతో పాటు అనేక అంటు వ్యాధుల నుంచి ..మిగతా 2లో



# కలిసి కట్టుగా పల్లెల ప్రగతి

## మహిళల ఆర్థిక పరిపుష్టికి కృషి

## మంత్రి కోమటిరెడ్డి





**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్:** గ్రామాల అభివృద్ధికి గ్రామస్తులందరూ కలిసికట్టుగా ఉండాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన నల్గొండ జిల్లా, నల్గొండ, తిప్పర్తి మండలాలలో వివిధ గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ముందుగా నల్గొండ మండలం, చిన్న సూరారం గ్రామ హమ్లెట్ గ్రామమైన పావురాల గూడెంలో కోటి 35 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన పిడబ్ల్యుడి రోడ్డును మంత్రి ప్రారంభించారు. చిన్న సూరారం, పెద్ద సూరారం, చందనపల్లి గ్రామాలలో ఏర్పాటుచేసిన సమావేశాలలో గ్రామస్తులతో మాట్లాడారు. మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు ఆర్థికంగా వారి కాళ్లపై వారు నిలబడి సాధికారత సాధించేలా ప్రభుత్వం తరపున మహిళా సంఘాలతో రైస్ మిల్లులు, గోదాములు, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని, మహిళలు చిన్నచిన్న వ్యాపారాలతో పాటు, రైస్ మిల్లులు నిర్వహించాలని కోరారు. ఆగస్టు 15న చిన్న సూరారం ..మిగతా 2లో

# ఉధృతికి తగ్గేవరకు పునరావాస కేంద్రాల్లోనే

## పునరావాస కేంద్రాల్లో నాణ్యమైన భోజనంతో పాటు పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

## భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రైణాల్ శ్రేష్ట



**భద్రాచలం, అక్షిత న్యూస్:** గోదావరి వరద ముంపు బాధితులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో నాణ్యమైన ఆహారంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట అధికారులను ఆదేశించారు. దుమ్ముగూడెం మండలం గంగోలు గ్రామంలో ముంపుకు గురైన డబుల్ బెడ్ రూమ్ కాలనీ, ప్రగళ్ల పల్లె లోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పునరావాస కేంద్రంలో ఉంటున్న ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలని ..మిగతా 2లో



# పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

## ఆరు లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

## నాటిన మొక్కల సంరక్షణ మనందరి బాధ్యత

## భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి/ అక్షిత బ్యూరో:** భువనగిరి పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ..మిగతా 2లో



www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



## ఉధృతికి తగ్గేవరకు పునరావాస కేంద్రాల్లోనే



**మొదటి పేజీ తరువాయి...**

అన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ పరిశుభ్రత పాటించాలని చెప్పారు. ఆరోగ్య క్యాంపులు నిర్వహిస్తూ ఆరోగ్య పరిరక్షణ పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని ఆదేశించారు. ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. వరద పూర్తిగా తగ్గి సాధారణ పరిస్థితి ఏర్పడే వరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని ప్రజలకు భరోసా కల్పించారు. అనంతరం, పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న వరద బాధితులతో ఆయన మాట్లాడుతూ వరదలు పూర్తిస్థాయిలో సాధారణ స్థితికి వచ్చేవరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని, ఆరోగ్యపరంగా భోజనం విషయంలో శానిటేషన్ పరంగా ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే నా దృష్టికి తీసుకొని రావాలని చెప్పారు. వరదల సమయంలో పిల్లల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పునరావాస కేంద్రంలో ఉండే ప్రజలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసి వారి ఆరోగ్య స్థితిగతులను పరిశీలించాలని అలాగే ఎవరైనా గర్భిణీ స్త్రీలు ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న పీహెచ్సీకి తరలించి డెలివరీ అయ్యే వరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో దుమ్ము గూడెం తహసీల్దార్ అశోక్ కుమార్ ఎంపీడీవో వివేక్ రామ్ ఎంపీఓ వీరారెడ్డి ఆర్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



**మొదటి పేజీ తరువాయి...**

భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, భువనగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 5 నుంచి 6 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. భువనగిరి పట్టణంలో 60 వేల మొక్కలు నాటే లక్ష్యంతో వన మహోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పర్యావరణం బాగుంటేనే మానవ మనుగడ సురక్షితంగా ఉంటుందని, పచ్చదనం పెంపు ద్వారా స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా సహకరించాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం మాత్రమే కాదు, వాటిని సంరక్షించి పెంచడమే మనందరి బాధ్యత" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నేడు నాటిన ప్రతి మొక్కను కాపాడుతూ, భావితరాలకు పచ్చని ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి--రవికుమార్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టిమంజుల--వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ, జిల్లా అటవీ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి, భువనగిరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, అటవీ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ,పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కలిసి కట్టుగా పల్లెల ప్రగతి

**మొదటి పేజీ తరువాయి...**

గ్రామ మహిళా సంఘాలకు 3 కోట్ల రూపాయలు, పెద్ద సూరారం గ్రామ సంఘాలకు రెండున్నర కోట్లు, చందనపల్లి గ్రామ మహిళా సంఘాలకు కోటి 50 లక్షల రూపాయల రుణాల చెక్కులను అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

చిన్న సూరారం, పెద్ద సూరారం గ్రామాల మధ్య వెర్ హోసింగ్ గోదాం లేదా రైస్ మిల్ ఏర్పాటు చేసేందుకు 5 నుండి 10 ఎకరాల స్థలాన్ని చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పావురాల గూడెంలో చౌకధర దుకాణాన్ని మంజూరు చేయడమే కాకుండా, వెంటనే డీలర్ ను నియమించాలని ఆదేశించారు. ఆయా గ్రామాలలో నిర్మాణంలో ఉన్న గ్రామ సంఘాల భవనాలను నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాలకు గరిష్టంగా బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వాలని డి ఆర్ డి ఓ ను ఆదేశించారు. మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని కోరారు. మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తద్వారా కుటుంబాల అభివృద్ధి చెందుతాయన్నారు. నల్గొండ, కనగల్, తిప్పర్తి మండలాలలో మహిళా సంఘాల చేత రైస్ మిల్లులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం గుడిసెల్లో ఎవరు ఉండరాదన్న ఉద్దేశంతో ప్రతి ఒక్కరికి 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నదని, మొదటి విడత రాష్ట్రవ్యాప్తంగా ఇండ్లు ఇవ్వడం జరిగిందని,రెండవ విడత గుడిసెలలో నివసించేవారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్లాట్లు ఉన్న వారికి కూడా ఇండ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. అందరికీ రేషన్ కార్డులతో పాటు, సన్న బియ్యం ఇస్తున్నామని,రాష్ట్ర వ్యాప్తంగా మూడు కోట్ల 25 లక్షల మందికి సన్న బియ్యం ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 20 వేల కోట్లతో ఆర్అండ్ బి రహదారులు





నిర్మిస్తున్నామన్నారు.

ఇకపై తాను గ్రామాలలో నిరంతరం పర్యటిస్తానని, వారానికి ఒకరోజు గ్రామాలు తిరుగుతానని, ఆదివారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో పర్యటిస్తానని, అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి నిధుల కొరత లేదని చెప్పారు. చందనపల్లి గ్రామ డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, గ్రామ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్ లో చెత్తను ఖాళీ చేయిస్తున్నామని, ప్రజలు లేని చోట డంపింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇదివరకే జిల్లా కలెక్టర్ ను ఆదేశించినట్లు చెప్పారు.

ప్రతి గ్రామంలో ఒక సబ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ,70% గ్రామాలలో సబ్‌స్టేషన్లు ఉన్నాయని మంత్రి తెలిపారు. అలాగే గ్రామంలోని పాఠశాలలో కంప్యూటర్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ మోహన్, పంచాయతి రాజ్ ఈఈ గిరిధర్, ఆర్అండ్ బి ఈఈ శ్రీధర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మయ్య, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, తహసిల్దార్ పరశురాం, ఎంపీడీవో యాకూబ్, అధికారులు,ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు మంత్రి వెంట ఉన్నారు.

# ఆరోగ్యవంతమైన జీవితానికి తొలి పునాది

**మొదటి పేజీ తరువాయి...**



రక్షణ లభిస్తుందని తెలిపారు. పుట్టిన తొలి ఆరు నెలల వరకు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని, అనంతరం వయస్సుకు తగిన పౌష్టికాహారంతో పాటు రెండేళ్ల వరకు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై సమాజంలోని ప్రతి కుటుంబానికి విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలకు శాస్త్రీయ అవగాహన కల్పిస్తూ తల్లిపాలను ప్రోత్సహించేందుకు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. తల్లి, శిశు ఆరోగ్య సంరక్షణలో తల్లిపాలు అత్యంత కీలకమైనవని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాల ప్రోత్సాహం ఎంతో అవసరమని అన్నారు.తల్లి పాలు శిశువుకు సరిపోను పట్టిన తర్వాత ఎక్కువగా ఉంటే వృథా చేయకుండా "సుషేనా ఫౌండేషన్, దాత్రి మిల్క్ బ్యాంకు కు డొనేట్ చెయ్యాలని, ఇట్టి తల్లి పాలు తాగించే అవకాశము లేని శిశువులకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని తెలిపారు.

అంతకుముందు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసే ప్లకార్డులు, నినాదాలతో సాగిన ర్యాలీలో తల్లులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినులు, ఆరోగ్య సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రంగా అజ్మీరా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ అధికారి జరీనా, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, వైద్య విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శంకుస్థాపనలకే కాదు.. గడువులోపు పనులు

# పూర్తి చేయడమే మా లక్ష్యం..

**రూ.1.49 కోట్లతో 49వ డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే నాయిని...**



కాజీపేట్, అక్షిత ప్రతినిధి: వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 49వ డివిజన్ పరిధిలో సుమారు రూ.1.49 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్



రెడ్డి మాట్లాడుతూ, తాము కేవలం శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు ఏర్పాటు చేసే రాజకీయాలకు పరిమితం కాదని, ప్రతి పనిని నిర్దిష్ట గడువులో పూర్తి చేయించడమే తమ లక్ష్యమని అన్నారు. వారం, పది రోజులు లేదా నెల రోజులకు మించకుండా పనులను పూర్తి చేసేలా అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే,తాను ఎన్నికైన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిరంతరం ప్రజల్లోనే ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నానని చెప్పారు. ప్రతి డివిజన్‌కు కోట్ల రూపాయల అభివృద్ధి నిధులను కేటాయించి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల సహకారం ఎంతో అవసరమని, సమస్యలు ఎదురైనప్పుడు రాజకీయాలకు అతీతంగా వాటి పరిష్కారానికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు ఇచ్చే సలహాలు, సూచనలను స్వాగతిస్తూ వాటిని పరిగణనలోకి తీసుకుని మరింత మెరుగైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారిపై

# ఇసుక పేరుకుపోవడంతో ప్రమాదాల ముప్పు

చిట్యాల అక్షిత ప్రతినిధి: హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారిపై వెలిమినేడు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి హనుమాన్ దేవాలయం వరకు రోడ్డుపై భారీగా ఇసుక పేరుకుపోవడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణించే వారి కళ్లలో ఇసుక పడుతుండటంతో ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. రోడ్డుపై పేరుకుపోయిన ఇసుక కారణంగా వాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉందని స్థానికులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ మార్గంలో నిత్యం వేలాది మంది ప్రయాణిస్తున్నందున వెంటనే చర్యలు తీసుకోవాలని



వారు కోరుతున్నారు. టోల్ ఫీజులు వసూలు చేస్తున్న అధికారులు రహదారి నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రమాదాలు సంభవించే ముందు టోల్ నిర్వహణ సంస్థ అధికారులు స్పందించి, రోడ్డుపై పేరుకుపోయిన ఇసుకను వెంటనే తొలగించి ప్రయాణికుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహన దారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వెన్నచర్ల - గన్యాగుల బీటీ రోడ్డు పనులను

# పరిశీలించిన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్

కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి: పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల గ్రామం నుంచి గన్యాగుల గ్రామానికి వెళ్లే రూ.3 కోట్లకు పైగా వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను పెద్దకొత్తపల్లి మండలం మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సూర్య ప్రతాప్ గౌడ్ మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణ పనుల్లో ఎలాంటి నాణ్యత లోపాలు చోటుచేసుకోకుండా అధికారులు, కాంట్రాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వీలైనంత వరకు మలుపులు తగ్గించి, ప్రజలకు సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు అనువుగా



రహదారిని నిర్మించాలని కోరారు. అలాగే పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెన్నచర్ల గ్రామ ఉపసర్పంచ్ బై రాముడు, మాజీ ఎంపీటీసీ డి. రవికుమార్, నక్కలపల్లి గ్రామ ఉపసర్పంచ్ మేకల మల్లేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుంటిపిల్ల రాముడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లె ఈశ్వరయ్య, ముచ్చపోతు శంకర్, మద్దని అగరయ్య, చిన్న సుల్తాన్, జక్క వెంకటయ్య, మన్నె రాజు పాల్గొని రోడ్డు పనులను పరిశీలించారు.

## చేనేత సహకార సంఘాల బలోపేతానికి పూర్తి సహకారం

**జిల్లా చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎ. శ్రీనివాసరావు**




అక్షిత ప్రతినిధి, రామన్నపేట: చేనేత సహకార సంఘాల బలోపేతానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని జిల్లా చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎ. శ్రీనివాసరావు తెలిపారు. రామన్నపేట పరిధిలోని లక్ష్మీ సిల్క్ చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేనేత కార్మికుల సంక్షేమం, పరిశ్రమ అభివృద్ధి కోసం సహకార సంఘాల పాలకవర్గాలు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చాణా అఖిల్ రెడ్డి, లక్ష్మీ సిల్క్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు వనం సుధాకర్, ఉపాధ్యక్షుడు వనం బిక్షపతి, కార్యదర్శి బోడ వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు చిందం పద్మ, పెండెం అరుణ, మహేశ్వరం అశోక్, తోర్ర రఘు, వనం శ్రీనివాస్, వనం అంబదాస్, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో జనసేన జెండా ఎగురవేస్తాం

**ప్రజా సమస్యలపై పోరాడుతూ జనసేనను బలోపేతం చేస్తాం**

**జనసేన రాష్ట్ర నాయకులు రామ్ తళ్లూరి, ఆర్కే సాగర్, హీరో తనీష్**

**షాద్‌నగర్‌లో రాష్ట్ర నాయకులకు ఘన స్వాగతం**




షాద్ నగర్, అక్షిత ప్రతినిధి: తెలంగాణలో గ్రామ స్థాయి నుంచి జనసేన పార్టీని బలోపేతం చేస్తూ ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు జనసేన రాష్ట్ర నాయకులు రామ్ తళ్లూరి, ఆర్కే సాగర్, హీరో తనీష్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంటరీ పరిధిలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యేందుకు వెళ్తున్న జనసేన పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రామ్ తళ్లూరి, ప్రచార కార్యదర్శి ఆర్కే సాగర్, సినీ నటుడు తనీష్‌లకు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ బైపాస్ వద్ద స్థానిక జనసేన నాయకులు జరుపుల రాజు నాయక్, మహమ్మద్ అశ్రఫ్ తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 17 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత విస్తరించనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజలతో కలిసి పోరాడుతామని స్పష్టం చేశారు. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు తెలంగాణలోని ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేసి యువతను, కార్యకర్తలను మరింత చైతన్యవంతం చేయనున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైతే ప్రజల తరఫున ఉద్యమాలు చేపడతామని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేస్తున్నామని, పార్టీ నాయకులను, కార్యకర్తలను ఎన్నికల బరిలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రజల విశ్వాసాన్ని సంపాదించేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీశైలం, పవన్ నాయక్, శివ జానీ, శ్రీకాంత్, రామకృష్ణ, మహబూబ్, లింగం నాయక్, మల్లేష్, శివ, కుమార్, చందు, పాపకంటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జడల అంజయ్యకు శ్రమశక్తి అవార్డు పథానం చేయాలి

## రాష్ట్ర ఎలక్ట్రీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్నాసి బాలరాజు





**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** ప్రైవేట్ ఎలక్ట్రిషన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు, కార్మిక నాయకులు, జడల అంజయ్యకు రాష్ట్ర ప్రభుత్వం శ్రమశక్తి అవార్డు ప్రకటించాలని ఆ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్నాసి బాలరాజు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కల్లూరు లో ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న లక్షలాది ఎలక్ట్రిషియన్ కుటుంబాలు ఆత్మగౌరవంతో బ్రతికేందుకు 40 సంవత్సరాల క్రితం ఎలక్ట్రిషమషియన్ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి బాటలు వేసిన కార్మిక పక్షపాతి జడల అంజయ్యకు శ్రమశక్తి అవార్డు స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రధానం చేసి వారిని ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ల సమాజ పక్షంగా రాష్ట్ర ప్రభుత్వం గౌరవించాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మండల కేంద్రాల్లో ఉన్న కమిటీ వారు ఆయా మండల తహసీల్దారులకు అంజయ్యకి శ్రమశక్తి అవార్డు ప్రధానం చేయాలని వినతి పత్రాలు అందించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కమిటీ వారు ఆయా జిల్లా కేంద్రాలలో జిల్లా కలెక్టర్లకు ఈ వినతి పత్రం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే హాషీం షరీఫ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ అధ్యక్షులు, ఎస్కే షరీఫ్, ఆ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి యు.కుమార్, సీనియర్ ఎలక్ట్రీషియన్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి 7,000/-ఆర్థిక సహాయం అందించినలి

## తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూలు జిల్లా చారకొండ మండలం జేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నెమలిగుట్ట తండాకు చెందిన కొర్రావత్ నీరు అనారోగ్యంతో మృతి చెందారు.ఈ విషాదకర ఘటన గురించి వార్డ్ సభ్యులు డీజే గోపాల్ ద్వారా తెలుసుకున్న తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి అండగా నిలుస్తూ,అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం 7,000/- వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని డీజే గోపాల్ ద్వారా కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ,కొర్రావత్ నీరు కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ,ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. అనంతరం మాజీ ఎంపీటీసీ నృపాల్,వార్డ్ మెంబర్ డీజే గోపాల్,పవన్, జేపల్లి రవి కిష్టన్, మున్నా, మణిరామ్ తదితరులు పార్థివ దేహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి



## జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

**వరంగల్, అక్షిత బ్యూరో:** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు (ఆగస్టు 1 నుంచి 7 వరకు) జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు, మీడియా నోట్, కార్యాచరణ ప్రణాళిక ప్రకారం జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తల్లిపాలు ప్రతి శిశువుకు మొదటి హక్కు, సంపూర్ణ పోషకాహారమని పేర్కొన్నారు. పుట్టిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించడం, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వడం, అనంతరం వయస్సుకు తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్ల లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం ద్వారా శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు.

అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామాలు, వార్డుల్లో అవగాహన సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, కమ్యూనిటీ ఆధారిత కార్యక్రమాలు నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

సమావేశంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి రాజమణి, సీడీపీఓలు, సూపర్వైజర్లు, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్





**అక్షిత ప్రతినిధి నారాయణపేట:** జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్--శ×× విజయవంతంగా పూర్తయిందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్,ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం ఆపరేషన్ స్మైల్ మరియు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమాల ద్వారా తప్పిపోయిన,వదిలివేయబడిన బాలలను గుర్తించి వారి కుటుంబాలకు చేర్చడంతో పాటు,కిరాణా దుకాణాలు,మెకానిక్ షాపులు,హోటళ్లు,ఇటుక బట్టీలు,పరిశ్రమలు,ఇతర వాణిజ్య సంస్థలు మరియు రోడ్లపై భిక్షాటన చేస్తున్న బాలలను గుర్తించి రక్షించడం జరుగుతుందని పేర్కొన్నారు.అవసరమైతే బాలలను సంబంధిత స్టేట్ హోమ్‌లకు తరలిస్తూ,వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ అందిస్తున్నట్లు



తెలిపారు.ఆపరేషన్ ముస్కాన్--శ××లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించి మొత్తం 61 మంది బాల కార్మికులను పట్టుకొని వీరిలో 59 మంది బాలురు,ఇద్దరు బాలికలు ఉన్నారు.బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై మొత్తం 32 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా,నిబంధనలు ఉల్లంఘించిన నలుగురు యజమానులకు రూ.27,000 జరిమానా విధించినట్లు ఎస్పీ వెల్లడించారు.విముక్తి చేసిన బాలలకు,వారి తల్లిదండ్రులకు బాలల హక్కులు,నిర్బంధ విద్య,బాల కార్మిక వ్యవస్థ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించి,తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,లేబర్ శాఖ,విద్యాశాఖ,జిల్లా బాలల సంరక్షణ విభాగం,వైద్య ఆరోగ్య శాఖ తదితర ప్రభుత్వ శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత,బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని వారు తెలియజేశారు.చిన్నారులను పనుల్లో పెట్టకుండా విద్యాబాట పట్టించడం ద్వారా వారి భవిష్యత్తును సురక్షితం చేయవచ్చు అని అన్నారు.ఎక్కడైనా బాలలను పనిలో పెట్టుకున్నా,బాల కార్మికులు కనిపించినా,తప్పిపోయిన లేదా వదిలివేయబడిన బాలల సమాచారం తెలిసినా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్--1098 లేదా డయల్--100కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఆపరేషన్ ముస్కాన్--శ×× కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పోలీసు శాఖతో సమన్వయంగా పనిచేసిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## పట్టుపరిశ్రమను లాభదాయకమైన

# అనుబంధ వ్యవసాయంగా చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ డా. సత్య శారద




**వరంగల్, అక్షిత బ్యూరో:** రైతులు పట్టుపరిశ్రమను లాభదాయకమైన అనుబంధ వ్యవసాయ కార్యకలాపంగా చేపట్టి అధిక, స్థిరమైన ఆదాయాన్ని పొందాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పిలుపునిచ్చారు. సెంట్రల్ సిల్క్ బోర్డు ఆధ్వర్యంలో "మేరా రేషమ్ మేరా అభిమాన్--2.0" కార్యక్రమంలో భాగంగా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ సమన్వయంతో శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వాటాదారుల సంప్రదింపు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు డ్రిప్ ఇరిగేషన్‌ను విస్తృతంగా వినియోగించాలని, పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

ఆయిల్ పామ్ తోటల్లో మల్బరీని అంతర పంటగా సాగు చేయడం, మల్బరీని సేంద్రీయ విధానంలో పండించడం, అంతర పంటలుగా పూల సాగు చేపట్టడం, భూగర్భ జలాల పరిరక్షణ కోసం వ్యవసాయ క్షేత్రాల్లో చెరువుల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.

పట్టు ఉత్పత్తులకు విలువ జోడింపు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ అవకాశాలను మరింతగా వినియోగించుకోవడానికి వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ సౌకర్యాలు, జిల్లాలోని ఎగుమతి హబ్‌ను రైతులు ఉపయోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు.

సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్తలు శ్రీమతి భువన (సైంటిస్ట్-బి), డా. బి. తిరుపం రెడ్డి (సైంటిస్ట్-సి) జిల్లాలో పట్టుపరిశ్రమ అభివృద్ధికి బోర్డు అందిస్తున్న సాంకేతిక సహాయం, పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలపై వివరించారు.




జాయింట్ డైరెక్టర్ అనుసూయ, అసిస్టెంట్ డైరెక్టర్ (సెరికల్చర్) తిరుపతి రెడ్డి, సెరికల్చర్ అధికారి మల్లయ్య రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, మార్కెటింగ్ అవకాశాల గురించి వివరించారు.

ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులను మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకం వైపు ప్రోత్సహించేందుకు ఇదే అనుకూల సమయమని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లాలో పట్టుపరిశ్రమ అభివృద్ధికి అనుకూల వాతావరణం, మార్కెటింగ్ అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

"మేరా రేషమ్ మేరా అభియాన్--2.0" ద్వారా సెంట్రల్ సిల్క్ బోర్డు అందిస్తున్న మార్గదర్శకాలు పట్టు రైతుల ఉత్పాదకత, నాణ్యత, మార్కెట్ అనుసంధానాన్ని మెరుగుపరచడంలో కీలకంగా నిలుస్తాయని కలెక్టర్ తెలిపారు. విజయవంతమైన పట్టురైతులు తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకుని మరింత మందిని ఈ రంగం వైపు ఆకర్షించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలపై

# మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం

### వేతనాలు తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఎండార్స్మెంట్ ను రద్దు చేయాలని టియుసిఐ డిమాండ్



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** మున్సిపల్ కార్మికులకు వేతనాలు తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఎండార్స్మెంటును రద్దు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ ) ఆధ్వర్యంలో సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రంఇవ్వడంజరిగింది.

ఈ సందర్భంగా టీ యూ సి ఐ జిల్లా కోశాధికారి అమర్లపూడి శరత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాకముందు కార్మికులకు గౌరవ వేతనాలు అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నెలరోజుల క్రితం కార్మికులకు జీవో నెంబర్ 6 విడుదల చేసింది అని దీంట్లో మూడుజోన్లుగాఅనగాహా1)మున్సిపల్ కార్పొరేషన్, 2)మున్సిపాలిటీ, 3)గ్రామీణ ప్రాంతం గా విభజన చేసిందని రాష్ట్రప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు వేతనం నిర్ణయిస్తూ మున్సిపాలిటీలకు ఎండార్స్మెంట్ విడుదల చేసింది.దీని కారణంగా మున్సిపాలిటీ కార్మికులకు ఉన్న వేతనంలో రూ. 1000 నుండి రూ.3000 రూపాయలు వేతనం తగ్గుతుంది. ఇది మున్సిపల్ కార్మికుల పొట్టగొట్టడమే అని అన్నారు.నిత్యవసర సరుకుల ధరలు ఒకపక్క విపరీతంగా పెరిగిపోయి ప్రస్తుతం వస్తున్న వేతనాలే సరిపోని స్థితిలో కార్మికులు కొట్టుమిట్టాడుతుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేతనాలు తగ్గించడం అంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మార్చింది. వేతన సంఘం సిఫారసు చేసిన 26 వేల వేతనం పెంచాల్సింది పోయి వేతనంలో కోత విధిస్తారా?. లేదా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాల్సిన స్థితి ఉంది. ఎన్నికల ముందు మాది కార్మిక సంక్షేమ ప్రభుత్వమని, ప్రజాపాలన అని, ప్రజలకు జవాబుదారితనంగా ఉంటామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తర్వాత వేతనాలు తగ్గించడం కార్మికుల బ్రతుకుపై వేటుపడినట్టే అని అన్నారు.

స్థానిక మంత్రి వాకిటి శ్రీహరి క్యాబినెట్లో ఇలాంటి వేతనాలపై చర్చ జరుగుతున్నప్పుడు స్పందించాల్సిన అవసరం ఉన్నది అని వేతనాలు తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించి కార్మికుల తరఫున నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వానికి కార్మికుల పొట్టగొట్టడం మంచిది కాదని చెప్పడానికి సిద్ధంగా కావాలని కోరుతున్నాము.లేనిపక్షంలో కార్మికుల ఆందోళన బాట పట్టాల్సిన అవసరం వస్తుంది. కావున వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఎండార్స్మెంట్ ను రద్దు చేస్తూ కేంద్ర వేతన సంఘం సిఫార్సు చేసిన 26 వేల రూపాయల వేతనాన్ని అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు రవి, ప్రసాద్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, కాంతమ్మ, ప్రసాదు, వెంకటమ్మ భారతమ్మ, ఈ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంతో పంటల మార్పిడి విధానాన్ని పాటించాలి

### కొండూరు గ్రామంలో రైతులకు అవగాహన గ్రామ సభ

### సర్పంచ్ కేతూరి ధర్మతేజ



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెంట్లవెల్లి మండలం కొండూరు గ్రామంలో సర్పంచ్ కేతూరి ధర్మతేజ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశానికి స్పెషల్ ఆఫీసర్ మండల వ్యవసాయ శాఖ అధికారి వికాస్ హాజరయ్యారు.ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు రైతులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కేతూరి ధర్మతేజ మాట్లాడుతూ వర్షాధార పంటలపై పూర్తిగా ఆధారపడకుండా, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. పంటల మార్పిడి విధానాన్ని అనుసరించడం వల్ల వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంతో పాటు పెట్టుబడి నష్టాలను నివారించే అవకాశం ఉంటుందని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించి, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు, నీటిని వృథా చేయకుండా ఇంకుడు గుంతలు ఫాంఫండ్ లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ నల్లపోతుల గోపాల్, గ్రామ ఉపసర్పంచ్ వడ్డేమాన్ రాముడు వార్డు మెంబర్లు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం





**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** హైకోర్టు న్యాయమూర్తి, రాజన్న సిరిసిల్ల పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి, జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి బి.పుష్పలత, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె శనివారం స్వాగతం పలికారు.

జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయనకు సిరిసిల్ల పట్టణంలోని పంచాయతీ రాజ్ అతిథి గృహంలో పుష్పగుచ్ఛాలు అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సిరిసిల్ల, వేములవాడ సీనియర్ సివిల్ న్యాయమూర్తులు పి.లక్ష్మణాచారి, అజయ్ కుమార్ జాదవ్, సిరిసిల్ల జూనియర్ సివిల్ జడ్జి జి.మేఘన, ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీ నాగేంద్రచారి చారి, తహసీల్దార్ మహేష్, తదితరులు ఉన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



## తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పిన 'ఆదర్శ' బోనాల వేడుకలు



**అక్షిత బ్యూరో జయశంకర్ భూపాలపల్లి (కాటారం) :** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో శనివారం బోనాల వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఉన్నత లక్ష్యంతో పాఠశాల యాజమాన్యం ఈ వేడుకలను ఏర్పాటు చేసింది. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విశేష సంఖ్యలో పాల్గొని ఉత్సాహంనింపారు. ప్రత్యేక ఆకర్షణగా అమ్మవారి వేషధారణలో వచ్చిన చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారు. భక్తిశ్రద్ధల ఊరేగింపు సాంప్రదాయబద్ధంగా మట్టి కుండల్లో బోనాలు ఎత్తుకుని, డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, శివశక్తుల పూనకాల మధ్య పాఠశాల నుంచి లక్ష్మీదేవర ఆలయం వరకు భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి నైవేద్యాలు ఆర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాల పాటలకు విద్యార్థులు చేసిన సంస్కృతి-సంప్రదాయ నృత్య ప్రదర్శనలు అలరించాయి.

**తెలంగాణ సంస్కృతిపై అవగాహనే మా లక్ష్యం**

మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు, బోనాల పండుగ విశిష్టతను తెలియజెప్పేందుకే ప్రతి ఏటా పాఠశాలలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు అన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ కృషిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా నర్సింహులు బాధ్యతల స్వీకరణ



**మహబూబ్‌నగర్, అక్షిత ప్రతినిధి:** మహబూబ్‌నగర్ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సి.పి.ఓ)గా బి. నర్సింహులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గణాంక శాఖ డైరెక్టర్, హైదరాబాద్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆయనకు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఇటీవల జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కె. రవీందర్ జూలై 31న పదవీ విరమణ చేయడంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో గణాంక అధికారిగా విధులు నిర్వహిస్తున్న బి. నర్సింహులను సి.పి.ఓగా నియమించారు.

బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి నర్సింహులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రణాళిక, గణాంక విభాగాల పనితీరు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

నూతన సి.పి.ఓగా బాధ్యతలు చేపట్టిన నర్సింహులకు జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, గణాంక శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలియజేసి, వారి పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## మత విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజా వ్యతిరేక విధానాలు

# అమలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

**జంతర్ మంతర్‌లో విద్యార్థులపై దాడి ప్రజాస్వామ్యంపై దాడే**

**విద్యార్థి నాయకులపై కక్షసాధింపు చర్యలు వెంటనే విరమించుకోవాలి**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవి కుమార్**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ,ప్రజల అసలు సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవి కుమార్ విమర్శించారు.ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలతో దేశ ప్రజలపై భారాలు మోపుతూ, మరోవైపు ప్రజాస్వామ్య హక్కులను హరిస్తోందని ఆయన అన్నారు.రామన్నపేట సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంజీ గార్డెన్‌లో నిర్వహించిన మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు




పిలుపునిచ్చారు.దేశంలో పెరుగుతున్న మతోన్మాద రాజకీయాలను ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని కోరారు.

టీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన పోలీసు దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో విద్యార్థులు తమ సమస్యలను వ్యక్తం చేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని, అలాంటి ఉద్యమాలను అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థి నాయకులపై కక్షసాధింపు చర్యలను వెంటనే విరమించుకోవాలని,అక్రమ కేసులను ఎత్తివేయాలని, ప్రజాస్వామ్య విలువలను కేంద్ర ప్రభుత్వం కాపాడాలని డిమాండ్ చేశారు.శిక్షణా తరగతులు ప్రారంభానికి ముందు సిపిఎం సీనియర్ కామ్రేడ్ పబ్బతి లింగయ్య పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కచం కృష్ణమూర్తి 20వ వర్ధంతి, మాజీ సిపిఎం మండల కమిటీ సభ్యుడు పిట్టల శ్రీనివాస్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి ఆశయాలు, త్యాగస్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజల హక్కుల సాధన కోసం మరింత కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య,మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటి సభ్యులు వనం ఉపేందర్, మండల కార్యదర్శివర్గ సభ్యులు బోయిని ఆనంద్,కందుల హనుమతు, జంపాల అండాలు,కల్లూరి నగేష్, మండల కమిటి సభ్యులు గొరిగే సోములు,గన్నెబోయిన విజయభాస్కర్, బావండ్లపల్లి బాలరాజు,గాదె నరేందర్, మీర్ ఖాజా అలీ, నాగటి ఉపేందర్, వేముల సైదులు,ఎండీ రషీద్,పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్,డివైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు శానాగొండ రాము, మెట్టు శ్రవణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మేడి ముకుంద, నాగటి లక్ష్మణ్,పులి బిక్షం, శానాగొండ వెంకటేశ్వర్లు, జితేందర్,కొమ్ము అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్ ద్వారా

# 314 మంది చిన్నారులకు విముక్తి

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపిఎస్**



**వరంగల్, అక్షిత బ్యూరో:** ఆపరేషన్ ముస్కాన్ -శ×× ద్వారా 314 మంది చిన్నారులను పని నుండి విముక్తి కలిగించినట్లు వరంగల్ పోలీస్ కమీషనర్ ఎన్.శ్వేత,ఐపిఎస్ తెలిపారు. ఇందుకు సంబందించి వరంగల్ పోలీస్ కమిషనర్ వివరాలను వెల్లడిస్తూ చిన్నారుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ గత నెల జులై 1వ తారీకు నుండి నిన్నటి రోజు వరకు చేపట్టిన 'ఆపరేషన్ ముస్కాన్-శ××' కార్యక్రమం ద్వారా మొత్తం 314 మంది చిన్నారులను రక్షించబడ్డారని. ఇందులో 269 మంది బాలురు, 45 మంది బాలికలు ఉన్నారని. ఈ ఆపరేషన్ ముస్కాన్ -శ×× ద్వారా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు నిబంధనల ప్రకారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ లోని పారిశ్రామిక ప్రాంతాల్లో, షాపుల్లో, ఇటుక బట్టిలలో, ప్రమాదకర ప్రాంతాల్లో వరంగల్ పోలీస్ కమిషనరెట్ పరిధి లోని (9) సబ్ డివిజన్ పోలీస్ టీమ్స్ ఏర్పాటు చేసి, ఆ టీమ్స్ కు ఇంచార్జిగా (9), (36) మంది సిబ్బందిని నియమించి, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీస్ యూనిట్ సిబ్బందితో పాటు వరంగల్ హనుమకొండ జనగాం జిల్లాలకు చెందిన బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, కార్మిక శాఖ అధికారులు, షేర్, స్కోప్, ఎఫ్ఎంఎం, ఎస్ ,ఎస్,ఎస్ స్వచ్ఛంద సంస్థల సిబ్బంది సహకారంతో బాల కార్మికులుగా మగ్గుతున్న 226 మందిని, బడి మానేసిన (డ్రాపౌట్స్) 85 మందిని, సురక్షితంగా ఆపరేషన్ ముస్కాన్ -శ×× టీం రక్షించి, వీరిని వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీల ముందు హాజరు పరిచి, పిల్లలకు వారు తల్లి తండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించామని వీరిలో తెలంగాణేతర రాష్ట్రాలైన బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్గఢ్ మరియు అస్సాం రాష్ట్రాలకు చెందిన 130 మంది చిన్నారులు కూడా ఉన్నారని కమీషనర్ వివరించారు.

నిబంధనలను ఉల్లంఘించి చిన్నారులతో పని చేయిస్తున్న యజమానులపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా మొత్తం 55 ఎఫ్.ఐ.ఆర్ లు నమోదు చేసినట్లు 92 ఐఆర్ లు కార్మిక శాఖ అధికారులు చేత నమోదు చేపించామని, అలాగే వివిధ పోలీస్ స్టేషన్స్ లోని జనరల్ డైరీస్ లో 118 మంది పిల్లల వివరాలను నమోదు చేపించామని కమీషనర్ తెలిపినారు.

ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ.. "పిల్లలు బడిలో ఉండాలి కానీ పనిలో కాదు. బాల్యానికి అండగా నిలవడమే ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశ్యం. బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవు," అని హెచ్చరించారు.

చిన్నారుల హక్కులను కాపాడటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కమీషనర్, కోరారు. లైన్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీరయ్య




**అక్షిత బ్యూరో, మంచిర్యాల:** బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీరయ్య అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, అదనపు సీనియర్ సివిల్ జడ్జి- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రామ్ మోహన్ రెడ్డి, అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కె. నిరోషా, స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ (ఎక్సైజ్) బి. కృష్ణ తేజ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త సత్తయ్య లతో కలిసి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ, పోక్సో చట్టంపై ఏర్పాటు చేసిన ఒక్కరోజు అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ




అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో విపరీతమైన పోకడలతో చిన్న వయసులోనే దారి తప్పుతున్నారని, సోషల్ మీడియా ప్రభావం సమాజంపై పడి పిల్లలలో సైతం చెడు ప్రవర్తన కలుగుతుందని తెలిపారు. పిల్లలకు వారి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలని, చెడు వ్యసనాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించాలని, సమాజం పట్ల బాధ్యతలను తెలియజేయాలని అన్నారు. సమ సమాజ స్థాపనలో గురువుల పాత్ర అనిర్వచనీయమైనదని, పిల్లలు, కళాశాల యువత మద్యపానం, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉపాధ్యాయులు, అధ్యాపకులు బాధ్యతగా వారిని సన్మార్గంలో నడిచే విధంగా తీర్చిదిద్దాలని తెలిపారు. పిల్లల హక్కుల పరిరక్షణ కోసం స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నతనంలోనే మంచి అలవాట్లు పిల్లలకు నేర్పించాలని, గుడ్ టచ్ – బాడ్ టచ్ పై అవగాహన కల్పించాలని తెలిపారు. పిల్లలకు వారి హక్కుల గురించి వివరించడం జరుగుతుందని, జె జె, పోక్సో చట్టాలపై పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని, బాల కార్మికులను రక్షించి వారికి నిర్బంధ విద్య అందిస్తున్నామని తెలిపారు. లైంగిక వేధింపులు, దాడులకు గురైన బాధితులను గుర్తించడం, బాధితులకు చట్టాలపై అవగాహన కల్పించడం, బాలలపై దాడులకు పాల్పడిన వారిని గుర్తించి కేసులు నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు.

డి.సి.పి. మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మించబడుతుందని, బాలల హక్కులను రక్షించడం బాధ్యతగా తీసుకోవాలని, బాలలను సన్మార్గంలో నడిపించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. షీ టీమ్స్ ఆధ్వర్యంలో బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం చేయడం జరుగుతుందని, సోషల్ మీడియాలో వచ్చే అసాంఘిక అంశాలను నిరోధించి పిల్లలు చూడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, బాలల హక్కుల పరిరక్షణ సమితి అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

### సూర్యాపేట జిల్లా ఇంటర్ విద్య అధికారి సులోచన రాణి



**నడిగూడెం, అక్షిత న్యూస్:** విద్యార్థులు క్రమశిక్షణతో నిత్యం కళాశాల తరగతులకు హాజరవుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఉన్నత లక్ష్యాల ను ఎంచుకొని లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూర్యాపేట జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి సులోచన రాణి విద్యార్థులకు పిలుపునిచ్చారు .శనివారం నడిగూడెం కెవిఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. ప్రభుత్వం కల్పించిన వసతులను అధ్యాపకుల జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం త్వరలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుందని కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్పొరేట్ కళాశాలకు ఏమాత్రం తీసి పోనీ విధంగా అన్ని ప్రభుత్వ కళాశాలలో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు .అనంతరం కళాశాల అధ్యాపకులచే ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని మారిన సిలబస్ ప్రశ్నాపత్రాలను ప్రాక్టీస్ చేస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు .ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సైన్స్ ప్రయోగ పరీక్షలు ఉన్నందున వాటిపై విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు . ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 187 మంది విద్యార్థులను నమోదు చేసినందుకు ప్రిన్సిపల్ అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు .ఈ వారంలో అడ్మిషన్లు 200 మార్క్ దాటాలన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డి విజయ నాయక్ అధ్యాపకులు శ్రీధర్ కృష్ణ మహేష్ వీరన్న ఈశ్వర్ వెంకటేశ్వరరావు శ్రీనివాసరావు తదితరులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శ్రీపురం హరీష్ రెడ్డి జన్మదిన వేడుకలు



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మండల రఘుపతి పేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు శ్రీపురం హరీష్ రెడ్డి హైదరాబాదు ఎమ్మెల్యే నివాసంలో తన జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది పుట్టినరోజు విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే హరీష్ రెడ్డిని సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**నడిగూడెం, అక్షిత న్యూస్:** కాంట్రాక్టు వ్యవస్థ ఏర్పాటు 25 సంవత్సరాలు చరిత్రలో మొదటి రోజున వేతనాలు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం నడిగూడెం కేవిఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒప్పంద అధ్యాపకులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఒప్పంద అధ్యాపకులు అందరికీ వేతనాలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు .కార్యక్రమంలో ఒప్పంద అధ్యాపకులు నగేష్ ధనుంజయ్, సుజాత పాల్గొన్నారు.

# వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు

### కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, సీఐ శ్యామ్‌సుందర్

**కాజీపేట్, అక్షిత ప్రతినిధి:** కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని కాజీపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తోటపల్లి రాజు తండ్రి పేరు:బుచ్చి రెడ్డి, మంచిర్యాల జిల్లా చెందిన వ్యక్తిని కాజీపేట పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.నిందితుడు గతంలోను ద్విచక్ర వాహనాల చోరీ కేసులలో నిందితుడిగా ఉన్నాడని, కాజీపేట్ , మట్వాడ, కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలకు పాల్పడిన చరిత్ర ఉందని తెలిపారు.

వ్యక్తిగత అవసరాల కోసం సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ప్రధానంగా రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాలలో పార్క్ చేసిన మోటార్ సైకిళ్లను లక్ష్యంగా చేసుకుని ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు తెలియజేశారు.

గత కొంతకాలంగా జరుగుతున్న బైక్ చోరీలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారాన్ని



సేకరించి నిందితుడిని గుర్తించారు.

కాజీపేట సీఐ శ్యామ్‌సుందర్ ఆదేశాల మేరకు ఎస్ఐ.శివ, ఎస్ఐ మౌనికా రెడ్డి,ఎస్ఐ యాదగిరి, క్రైమ్ టీమ్ సభ్యులు క్రాంతికుమార్, కుమారస్వామి తమ బృందంతో కలిసి పలు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. నిరంతర నిఘా, కఠినమైన శ్రమ, అప్రమత్తతతో నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి కేసును త్వరగా ఛేదించిన పోలీసు బృందాన్ని అభినందించారు. నేరాల నియంత్రణలో భాగంగా కాజీపేట పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

అలాగే, ప్రజలు తమ వాహనాలను సురక్షితమైన ప్రదేశాల్లో ఉంచాలని, వాహనాలకు తాళాలు వేయడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కేసును త్వరగా ఛేదించి, చోరీకి గురైన వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసు సిబ్బందిని స్థానిక ప్రజలు అభినందించారు.రైల్వే స్టేషన్ చుట్టుప్రక్కల, దుకాణాల ముందు, ఇంటి ముందు అనధికారికంగా మోటార్ పార్కింగ్ చేయరాదని ఒకవేళ చేసినచో వాహనం సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోబడునని పోలీసులు హెచ్చరించారు.

## వైద్య ఖర్చులకు ఉప్పల వెంకటేష్ 30,000 రూపాయల ఆర్థిక సహాయం



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి నియోజకవర్గం, కల్వకుర్తి మండలం,జీడిపల్లి గ్రామం మహాముద బేగం భర్త సాదిక్ కాలు శాస్త్ర చికిత్స కోసం హాస్పిటల్ లో ఖర్చులకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ నేత శ్రీ ఉప్పల వెంకటేష్ అన్న 30,000/- ముప్పై వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపాల్ నాయక్, మాజీ సర్పంచ్ కల్పన కృష్ణయ్య,మాజీ ఉపసర్పంచ్ ఖాజా,మల్లేష్,కాజా,శంకర్,నవీన్,శివ తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ బోర్డ్ కాలనీ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మేయర్‌కు బీజేపీ నేత తోట సాగర్ వినతి




**కరీంనగర్ అక్షిత న్యూస్:** కరీంనగర్ పట్టణంహౌసింగ్ బోర్డు కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ 7వ డివిజన్ బీజేపీ నేత తోట సాగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా ఇక్కడి ప్రాంతంలోని రోడ్ నెంబర్ - 2, శివాలయం ఏరియా రోడ్డు లోతట్టు ప్రాంతాలలో ప్రతి వర్షాకాలంలో వర్షపు నీరు నిలిచిపోతుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి ఏటా ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఈ కష్టాలను శాశ్వతంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ నేత తోట సాగర్ వినతిపై మేయర్ కొలగాని శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఆయా ప్రాంతాలలో పర్యటించి, సమస్యలను పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామని హామీనిచ్చారు.

## గౌడ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

### అధ్యక్షుడిగా మొర్రి యాదయ్య గౌడ్



**వలిగొండ/అక్షిత న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని నెమలికాల్వ గ్రామంలో శనివారం రోజున నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌడ సంఘం అధ్యక్షులుగా మొర్రి యాదయ్య గౌడ్, ఉపాధ్యక్షులు వంగాల బాలకృష్ణ గౌడ్, గోపగోని దేవేందర్ గౌడ్, కార్యదర్శి వంగాల శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి నిలుగొండ ఆనంద్ గౌడ్ ను గౌడ సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షులు మొర్రి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ మన గౌడ సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంగాల బిక్షపతి గౌడ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, నిలిగొండ వంగాల వెంకటేష్ గౌడ్, మర్రి సత్యనారాయణ గౌడ్, వంగాల నాగరాజు గౌడ్, కిషన్ గౌడ్, సుంకరి నాగరాజు గౌడ్, వంగాల నరేష్ గౌడ్, గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ‘అరైవ్ అలైవ్’ స్పెషల్ డ్రైవ్..

### 50 వాహనాలు సీజ్

**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శనివారం “అరైవ్ అలైవ్ స్పెషల్ డ్రైవ్” పేరుతో జిల్లా పోలీసులు, రవాణా శాఖ సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

భూపాలపల్లి లో జరిగిన ఈ కార్యక్రమంను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ స్వయంగా తనిఖీలను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగాన్ని అధికారులు పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై





మోటారు వాహనాల చట్టం ప్రకారం చలాన్లు విధించడంతో పాటు 50 వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రతి ప్రయాణం సురక్షితంగా ఉండేలా చేయడమే ఈ ప్రత్యేక డ్రైవ్ లక్ష్యమని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాల హెల్మెట్ ధరించాలని, కార్లలో సీటుబెల్ట్ వినియోగించాలని, వేగ పరిమితులు పాటించాలని, మద్యం సేవించి లేదా మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని సూచించారు.రోడ్డు భద్రత ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ ట్రాఫిక్ నిబంధనలను స్వచ్ఛందంగా పాటించి “అరైవ్ అలైవ్” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు..

**మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వద్దు**

చిన్న పిల్లలకు ఎట్టి పరిస్థితులను వాహనాలు ఇవ్వద్దని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు.. భూపాలపల్లి లో చేపట్టిన అరైవ్ అలైవ్ స్పెషల్ డ్రైవ్ లో వాహనాలు నడిపిన మైనర్లను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.. ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు..ఈ కార్యక్రమంలో డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్ ,రవాణా శాఖ అధికారులు, పోలీసులు,తదితరులు పాల్గొన్నారు..

## దళిత క్రైస్తవులు ఆగస్టు 10 “నల్లదినంగా” పాటించాలి

### బిషప్స్,పాస్టర్స్ దళిత క్రైస్తవులు అన్ని కలెక్టరేట్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేయాలి



**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి:** భారత దేశంలో రాజ్యాంగ బద్ధంగా కొనసాగుతున్న రిజర్వేషన్ ప్రక్రియకు నేటి పాలక వర్గాలు మత వివక్షతను పురిగొల్పుతున్నందుకు నిరసన దేశంలోని దళిత క్రైస్తవులు,దళిత ముస్లిం సోదరులు ఆగస్టు 10 “నల్లదినం”గా పాటించాలని సూర్యాపేట జిల్లా పాస్టర్స్ చైర్మన్ రెవ. డా.శాంసన్ మామిడి,జిల్లా గౌరవ అధ్యక్షులు బిషప్ సిహెచ్.సాల్మాన్ రాజులు పిలుపునిచ్చారు.శనివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బిషప్.దుర్గం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు క్రైస్తవ నాయకులు పాల్గొని మాట్లాడారు.1950 ఆగస్టు 10న భారతదేశపు మొదటి రాష్ట్రపతి డా.రాజేంద్ర ప్రసాద్ షెడ్యూల్డ్ కులాల ఉత్తర్వులపై తొలి సంతకం చేశారని,ఈ ఉత్తర్వు ప్రకారం మొదట్లో హిందూ మతాన్ని ఆచరించే వ్యక్తులను మాత్రమే షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) సభ్యులుగా గుర్తించబడిందని పేర్కొన్నారు. తదనంతరశీలో సవరణలలో సిక్కులను(1956), బౌద్ధులను (1990లో)చేర్చినప్పటికీ, క్రైస్తవ,ఇస్లాం మతాల్లోకి మారిన నిమ్న కులాల వారిని షెడ్యూల్డ్ కుల హోదా నుండి మినహాయించడం కొనసాగిందని గుర్తు చేశారు.దీనివల్ల దళిత క్రైస్తవులకు వారికి విద్య,ఉద్యోగాలలో రావాల్సిన వాటా అందలేక పోయిందని వాపోయారు.అందుకు నిరసనగా ఈనెల 10న ఉదయం 10 గంటలకు ఆయా జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల ముందు డినిమినేషన్ బేధం లేకుండా క్రైస్తవులు నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్రభుత్వ అధికారులకు శాంతియుతంగా వినతి పత్రాలు సమర్పించాలని కోరారు.ఈ సమావేశంలో రెవ.బి. జోవహర్ పాల్,బ్రదర్ మీసాల ప్రభుదాసు,రెవ.డా.జలగం జేమ్స్,రెవ. గుంటూరు బాబురావు,రెవ.ఏర్పుల క్రిస్టోఫర్,పాస్టర్ గండమళ్ళ ప్రేమ్ కుమార్,పాస్టర్ పెరుమాళ్ళ ప్రసన్న కుమార్,రెవ.తడంకి కిరణ్ బాబు,రెవ. పుల్లూరు బోయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి

### జనసేన నాయకులు డా. బండారి రాజ్‌కుమార్



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్‌లో నిర్వహించిన ఆటో యూనియన్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో జనసేన కరీంనగర్ నాయకులు డా. బండారి రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి సమస్యలను ఓర్పుగా విని, వాటి పరిష్కారం కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

అనంతరం మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఆటో కార్మికులు నేడు తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. పెరుగుతున్న ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులు, విడిభాగాల ధరల పెరుగుదల, కుటుంబ పోషణ భారం కారణంగా ఆటో డ్రైవర్ల జీవితం దుర్భరంగా మారిందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేరలేదని, ప్రభుత్వం ఆ హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరారు.అదేవిధంగా యాప్ ఆధారిత రవాణా సేవలు, ముఖ్యంగా రాపిడో వంటి సేవల విస్తరణ వల్ల సంప్రదాయ ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో తీసుకొని, ఆటో కార్మికుల జీవనోపాధికి భంగం కలగకుండా సమతుల్య విధానాన్ని రూపొందించాలని సూచించారు.రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే రాష్ట్రంలోని ఆటో యూనియన్ల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి, ఇంధన ధరలు, యాప్ ఆధారిత రవాణా సేవల ప్రభావం, సంక్షేమ పథకాలు, బీమా, ఆరోగ్య భద్రత, పెన్షన్, ఉపాధి రక్షణ వంటి అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.“ఆటో కార్మికులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వాములు. వారి కష్టాలను వినడం మాత్రమే కాదు, పరిష్కరించడం కూడా ప్రభుత్వ బాధ్యత. వారి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలి” అని డా. బండారి రాజ్‌కుమార్ అన్నారు.

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఎప్పటిలాగే శ్రమజీవుల, కార్మికుల పక్షాన నిలుస్తున్నారని, అదే స్ఫూర్తితో జనసేన పార్టీ తెలంగాణలో కూడా ఆటో కార్మికుల హక్కులు, సంక్షేమం, గౌరవప్రదమైన జీవనోపాధి కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.